జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 56 8-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

- గల్ఫ్ దేశాలకు సారీ చెప్పిన ఇరాన్ ప్రెసిడెంట్
- ఎనిమిదో రోజుకు చేరుకున్న యుద్ధం
- ఇప్పటి వరకు చేసిన దాడికి 'సారీ' అన్న పెజెష్కియాన్
- గల్ఫ్ దేశాలపై ఇక దాడులు చేయబోమన్న అధ్యక్షుడు
- పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం ప్రతిదాడి చేస్తామని హెచ్చరిక



2లో





మిగతా 2లో

## ట్రిపుల్ టైటిల్ వేటలో..

- నేడు టి20 వరల్డ్ కప్ ఫైనల్
- న్యూజిలాండ్‌తో భారత్ ఢీ
- జోరు మీదున్న టీమిండియా ఆత్మవిశ్వాసంతో కివీస్
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రసారం

భారత జట్టు 2024 టి20 ప్రపంచ కప్‌లో విజేతగా నిలిచిన తర్వాత ఇప్పటి వరకు 49 మ్యాచ్‌లు ఆడితే 40 గెలిచింది. 2023 ఆగస్టు నుంచి మన టీమ్ ఒక్క సిరీస్ కూడా కోల్పోలేదు. జట్టులో పలు మార్పులు చేసుకున్నా, ఆఖరి క్షణాల్లో ఆటగాళ్లను చేర్చినా ఫలితాల్లో మాత్రం తేడా రాలేదు. ఎలాంటి నిర్ణయం, వ్యూహమైనా అద్భుతంగా పని చేశాయి. ఇలాంటి విజయాల తర్వాత, ఇంత బలమైన జట్టుకు ఇప్పుడు వరల్డ్ కప్ గెలిచేందుకు అన్ని రకాలుగా అర్హత ఉంది. కానీ అనిశ్చితికి మారుపేరైన టి20 క్రికెట్‌లో కొన్ని అనూహ్య క్షణాలు కూడా రాత మారుస్తాయి. అలాంటివి అధిగమించి టీమిండియా మూడోసారి, వరుసగా రెండోసారి వరల్డ్ కప్‌ను సొంతం చేసుకొని కొత్త చరిత్ర సృష్టించగలదా?



## కర్ణుడు కాదు కుంభకర్ణుడు, మహాక్రూరుడు

- పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి కర్ణుడే అయితే రైతుబంధు ఎందుకు వేయడం లేదని ప్రశ్న
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్నారన్న హరీశ్ రావు

తాను కర్ణుడిలాంటి వాడినన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. చొప్పదండి నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కర్ణుడు కాదని, కుంభకర్ణుడని ఎద్దేవా చేశారు. తనను తాను కర్ణుడితో పోల్చుకుంటున్న ముఖ్యమంత్రి మహాక్రూరుడు అని మండిపడ్డారు. కర్ణుడు మాటతప్పని వాడని,

- మిగతా 2వ పేజీలో

## రాష్ట్రపతిని అవమానించడం సిగ్గుచేటు

- బెంగాల్ ప్రభుత్వం అన్ని హద్దులూ అతిక్రమించింది
- ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

న్యూఢిల్లీ :రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అవమానించడం నిజంగా సిగ్గుచేటు అని ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. గతంలో



2లో

## గణపతి కూడా లొంగిపోవాలి..

# ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పిస్తాం

**ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలి -సీఎం రేవంత్ రెడ్డి**





- 130 మంది మావోయిస్టుల లొంగుబాటుకు అధికారులు చాలా కృషిచేశారు
- లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తున్నాం
- శాంతియుత మార్గాలతోనే ఎలాంటి సమస్యకైనా పరిష్కారం లభిస్తుంది

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టులు తమ ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. దశాబ్దాలుగా అడవిని నమ్ముకుని పోరాటం చేస్తున్న కీలక నేతలు సైతం ప్రజాస్వామ్య మార్గాన్ని ఎంచుకోవడం రాష్ట్రంలో శాంతి స్థాపనకు కొత్త ఊపిరి పోసింది. ప్లాటూన్-1, వంటి ప్రధాన విభాగాలకు చెందిన ఈ మావోయిస్టుల లొంగుబాటు వెనుక పోలీసు ఉన్నతాధికారుల దీర్ఘకాలిక శ్రమ, ప్రభుత్వ పునరావాస విధానాలపై ఉన్న నమ్మకం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ భారీ లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు మొత్తం 124 అత్యాధునిక తుపాకులను వారు పోలీసులకు అప్పగించారు. వీటిలో ఒక రైఫిల్‌తో పాటు, రైఫిళ్లు, రైఫిళ్లు, , 18 .303

- మిగతా 2వ పేజీలో



2లో

## యుద్ధ కల్లోలం..

- విమానాశ్రయాలపై దాడులు
- మంటల్లో టెహ్రాన్ విమానాశ్రయం
- 16 విమానాలు ధ్వంసం: ఇజ్రాయెల్
- దుబాయ్ ఎయిర్‌పోర్టుపై ఇరాన్ దాడులు
- ఇరాక్‌లో సైనిక విమానాశ్రయంపై కూడా
- మీపై దాడులు చేసినందుకు క్షమించండి
- గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుని విజ్ఞప్తి
- ఇది ఇరాన్ ఓటమి ప్రకటనే: ట్రంప్
- హార్ముజ్ వద్ద మీకోసం వెయిటింగ్
- అమెరికా సేనలను కవ్వించిన ఐఆర్‌జీసీ
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం
- నబిషిట్ వద్ద 47 మంది దుర్మరణం

## జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది: లోకేశ్

- ప్రజలను వంచించడానికే ఆ హామీ అన్న లోకేశ్
- ప్రతి నెల రూ. 100 కోట్ల ముడుపులు అందాయని ట్వీట్
- రూ. 3,500 కోట్ల లాండరింగ్ జరిగిందన్న లోకేశ్





## చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- చందానగర్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళాదినోత్సవం
- 40 మంది మహిళలకు పురస్కారాలు

చందానగర్: చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని, ఆర్థిక స్వావలంబన సాధనే లక్ష్యంగా ఆడబిడ్డలు కష్టపడాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం చందానగర్‌లో అంతర్జాతీయ

## కొత్తగా ఆలోచించే వారి కోసం

# క్రియేటివ్ సిటీ

- త్వరలో అమరావతి వేదికగా గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు
- సాంకేతికతతో భారత్‌కు రివర్స్ మైగ్రేషన్ తప్పదని సీఎం వెల్లడి
- దక్షిణాదిలో తగ్గుతున్న జనాభా రేటును పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- భారతీయులు.. ప్రపంచంలో గ్లోబల్ లీడర్లు
- రివర్స్ మైగ్రేషన్.. నిపుణులు తిరిగి ఇండియాకు

'విభిన్నంగా ఆలోచించే వారి కోసం, సృజనాత్మకతకు పెద్దపీట వేసే మేధావుల కోసం అమరావతిలో అత్యాధునికమైన 'క్రియేటివ్ సిటీ'ని నిర్మిస్తున్నాం. కేవలం పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్-2026' సదస్సులో పాల్గొన్న ఆయన, తన ప్రసంగంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక విషయాలను ప్రపంచ దేశాల ప్రతినిధులతో పంచుకున్నారు. అమరావతిలో కేవలం భవనాలు మాత్రమే

- మిగతా 2వ పేజీలో



# యుద్ధ కల్లోలం.. విమానాశ్రయాలపై దాడులు

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ కల్లోలం నానాటికీ పెరుగుతూనే ఉంది. శనివారం ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా కనీవినీ ఎరగని స్థాయిలో దాడులకు దిగాయి. టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై భారీగా క్షిపణులు, బాంబులతో విరుచుకుపడ్డాయి. దాంతో విమానాశ్రయం, పరిసర ప్రాంతాలు దద్దరిల్లిపోయాయి. ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ విభాగానికి చెందిన 16 విమానాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. హెజ్బొల్లా తదితర గ్రూపుల నుంచి ఆయుధాలు, నిధుల సేకరణకు ఆ విమానాలను ఇరాన్ వినియోగిస్తోందని ఆరోపించింది. విమానాశ్రయ సమీపంలోని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఎయిర్ డిఫెన్స్ కమాండ్ సెంటర్ కూడా దాడుల్లో ధ్వంసమైంది. ఇస్ఫహాన్‌లోని అణు కేంద్రంపైనా బాంబుల వర్షం కురిసింది. ఒక్క రోజులోనే ఇరాన్‌వ్యాప్తంగా 400కు పైగా లక్ష్యాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. వారం రోజుల్లో ఇరాన్‌లో 3,000కు పైగా లక్ష్యాలను ధ్వంసం చేశామని అమెరికా వెల్లడించింది. వాటిలో కీలకమైన కమాండ్ సెంటర్లు, సైనిక ప్రధాన కార్యాలయాలు, క్షిపణి కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల వంటివి ఉన్నట్టు పేర్కొంది. ఇరాన్‌లో మృతుల సంఖ్య 1,332కు పెరిగినట్టు ఐరాసలో ఆ దేశంలో రాయబారి ఆమిర్ సయీద్ ఇరవనీ తెలిపారు. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై తీవ్రస్థాయిలో ప్రతి దాడులకు దిగింది. దుబాయ్ విమానాశ్రయంపై మరోసారి డ్రోన్ దాడి చేసింది. దాంతో రన్‌వేకు అతి సమీపంలో పలుచోట్ల పొగ భారీగా పైకెగసిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. బాంబు సైరన్లు మోగడంతో ప్రయాణికులు విమానాశ్రయంలోని ట్రెయిన్ టన్నెళ్లలోకి పరుగులు తీశారు. విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు కొద్ది గంటల పాటు నిలిచిపోయాయి. దుబాయ్‌వ్యాప్తంగా పలుచోట్ల భారీ పేలుళ్లు విన్పించాయి. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోనూ ఓ సైనిక విమానాశ్రయంపై డ్రోన్ దాడి జరిగింది. అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులను మరింత తీవ్రతరం చేసింది. తూర్పు ప్రాంత నగరమైన నబిషిట్, పరిసరాల్లో కనీసం 47 మంది వాటికి బలయ్యారని లెబనాన్ ఆరోగ్య శాఖ పేర్కొంది. 40 మందికి పైగా గాయపడ్డట్టు తెలిపింది. తమ దేశంలో ఇప్పటిదాకా మృతుల సంఖ్య 300 దాటినట్టు వెల్లడించింది. హెజ్బొల్లా దాడుల్లో తమ సైనికులు ఐదుగురు గాయపడ్డట్టు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్లో ఇద్దరు మరణించినట్టు తెలుస్తోంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులను ఎదుర్కొనే క్రమంలో గల్ఫ్ దేశాలపైనా దాడులకు దిగినందుకు వాటికి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ క్షమాపణలు తెలిపారు. తమకసలు వాటిపై దండెత్తే ఉద్దేశమే లేదన్నారు. "ఆ దేశాల నుంచి తమపై దాడులు జరిగితే తప్ప ఇకనుంచి వాటిపై దాడికి దిగబోం. మా నాయకత్వ మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది"అని ప్రకటించారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేసినట్టుగా ఆ దేశానికి లొంగిపోయే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ తమ మతిలేని దాడులను పూర్తిగా నిలిపేసేదాకా వాటిని తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తూనే ఉంటామని ప్రకటించారు. కానీ ట్రంప్ మాత్రం ఇరాన్ ఇప్పటికే పూర్తిగా ఓడిపోయిందని చెప్పుకొచ్చారు. పెజెష్కియాన్ ప్రకటనే అందుకు నిదర్శనమన్నారు.

## జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది: లోకేశ్

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక అసలు కథ వేరే ఉందని, ఆ హామీ కేవలం ప్రజలను వంచించడానికేనని లోకేశ్ ఆరోపించారు. ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని, గత ఐదేళ్లలో జరిగిన అవినీతి చిట్టాను ఆయన బయటపెట్టారు. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాల క్లిప్పింగ్ లను కూడా లోకేశ్ తన ట్వీట్ లో పంచుకున్నారు. మద్యం వ్యాపారం ద్వారా ప్రతి నెలా సుమారు వంద కోట్ల రూపాయల మేర ముడుపులు అందాయని, మొత్తంగా 3,500 కోట్ల రూపాయల మేర మనీ లాండరింగ్ జరిగిందని లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే 1,048 కోట్ల రూపాయల నగదు లావాదేవీల జాడను వెలికితీసిందని గుర్తుచేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో జగన్ మద్య నిషేధం గురించి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు ఆయన అనుచరులు అక్రమ మద్యం ద్వారా వేల కోట్లు గడించారని మండిపడ్డారు. ఈ క్రమంలో వేలాది పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలకు ఈ దోపిడీపై సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండిపోతారా? అంటూ జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న సంధించారు.

## చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

(మొదటి పేజీ తరువాయి)

మహిళాదినోత్సవాన్ని మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కేటీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పలువురు మాజీ కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేటి సమాజంలో పురుషాధిక్యత అడుగడుగునా ఉందన్నారు. రాజకీయాలు కూడా దానికి అతీతం కాదన్నారు. పోటీ ప్రపంచంలో మహిళలు నిలదొక్కుకోవాలంటే రెట్టింపు ప్రయత్నం చేయక తప్పదన్నారు. అమ్మాయిలు తమ కాళ్ల మీద తాము నిలబడి ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తనకు కూడా కూతురు ఉందని గుర్తు చేస్తూ, యువతకు ఆయన కీలక సూచనలు చేశారు. ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడకుండా, సొంతంగా ఉద్యోగం లేదా వ్యాపారం చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచే స్థాయికి ఎదిగినప్పుడే సమాజంలో గౌరవం, గుర్తింపుతో పాటు మహిళలకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మహిళా రిజర్వేషన్లు అమలులోకి రానున్న నేపథ్యంలో విద్యావంతులు, సామాజిక స్థితిగతులపై అవగాహన ఉన్న మహిళలు రాజకీయాల్లోకి రావాలని సూచించారు.

## ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు. "ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరఫున, ఇరాన్ ప్రజల తరఫున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## ట్రిపుల్ టైటిల్ వేటలో..

అహ్మదాబాద్: టి20 ప్రపంచ కప్‌లో రెండుసార్లు (2007, 2024) విజేతగా నిలిచి ఇప్పుడు మూడో టైటిల్‌పై గురి పెట్టిన జట్టు ఒకవైపు...తొమ్మిది ప్రయత్నాల్లో ఒక్కసారి కూడా ట్రోఫీని అందుకోలేకపోయిన జట్టు మరోవైపు... ఒక టీమ్ టోర్నీ గెలిస్తే తొలిసారి 'ట్రిపుల్' సాధించిన జట్టు కావడంతో పాటు సొంతగడ్డపై నెగ్గిన తొలి టీమ్‌గా కొత్త చరిత్ర సృష్టిస్తుంది. మరో టీమ్ గెలిస్తే సుదీర్ఘ కాలంగా అందకుండా ఊరిస్తున్న వరల్డ్ కప్ కల నెరవేరుతుంది. ఇలాంటి అంచనాల మధ్య నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు డిఫెండింగ్ చాంపియన్ భారత్, న్యూజిలాండ్ మధ్య టి20 వరల్డ్ కప్ ఫైనల్ జరగనుంది. స్వదేశంలో టీమిండియా విజయంపై అభిమానులు భారీ ఆశలతో ఉండగా... కివీస్ తమ స్థాయికి మించిన ప్రదర్శనను కనబర్చాలని పట్టుదలగా ఉంది. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన ఇదే మైదానంలో టి20 వరల్డ్ కప్ ఫైనల్ గెలిచి ట్రోఫీని అందుకోవాలని సూర్యకుమార్ బృందం భావిస్తోంది. ప్రపంచకప్‌లో భారత్ ప్రదర్శన చూస్తే ఇప్పుడు ఫైనల్ కోసం తుది జట్టులో మార్పులు చేయాల్సిన అవసరం కనిపించడం లేదు. కానీ 'సూపర్ ఎయిట్స్' దశలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి పేలవ ఆట జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో ఎంత ఘనంగా బౌలింగ్ చేసినా టి20ల్లో తాజా ఫామ్ కీలకం. దాదాపు 12 పరుగుల ఎకానమీతో అతను 4 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు. వరుణ్ మిస్టరీని ప్రత్యర్థులు ఛేదించినట్లుగా కనిపిస్తోంది. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఇదే భావిస్తే అతని స్థానంలో ఎడంచేతి వాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం దక్కవచ్చు. ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్‌పై కూడా కాస్త సందేహం ఉన్నా... ఒంటిచేత్తో ఆట స్వరూపాన్ని మార్చే అతడిని పక్కన పెట్టే ఆలోచన చేయకపోవచ్చు. సంజు సామ్సన్ గత రెండు మ్యాచ్‌లలో చెలరేగిన విధంగా మరో నాకౌట్ మ్యాచ్‌లోనూ ఆడితే జట్టుకు తిరుగుండదు. సూర్యకుమార్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా సత్తా చాటితే భారీ స్కోరు ఖాయం. చివర్లో హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ వేగంగా అందించే అదనపు పరుగులతో ప్రత్యర్థికి టీమిండియా సవాల్ విసరడం ఖాయం.ముందుగా బ్యాటింగ్ చేస్తే మరోసారి 200కు పైగా స్కోరు చేస్తే జట్టు నిశ్చింతగా ఉండవచ్చు.

## కొత్తగా ఆలోచించే వారి కోసం క్రియేటివ్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

ఉండవని, అక్కడ డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలు కొలువుదీరుతాయని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను ఏర్పాటు 'చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో 'సాంకేతికత – సుపరిపాలన – భవిష్యత్తు' అనే అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2016 నుంచి జరుగుతున్న ఈ సదస్సుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న చంద్రబాబు, ఏపీని 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్'గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ డేటా సెంటర్లతో పాటు, ఆరోగ్య రంగంలో డ్రోన్ అంబులెన్సులు వంటి విప్లవాత్మక మార్పులు ఏపీలో ఇప్పటికే రియాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తూ, ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు. ప్రపంచ గమనంలో భారతీయుల పాత్ర, నాలెడ్జ్ ఎకానమీలో దేశం సాధించబోతున్న ప్రగతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఐటీ రంగం నుండి గ్రీన్ ఎనర్జీ వరకు, జనాభా విధానం నుండి ఏఐ (ూ×) వరకు భవిష్యత్ భారత్ ఎలా ఉండబోతోందో తన విజన్‌ను పంచుకున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ డిప్లొమాట్లు భారతీయులేనని చంద్రబాబు కొనియాడారు. ఎక్కడికి వెళ్లినా స్థానిక సంస్కృతులతో కలిసిపోవడంలో భారతీయులకు మించిన వారు లేరన్నారు. గతంలో మన నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు వెళ్లడం 'మేధో వలస'గా భావించేవారని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని ఆయన విశ్లేషించారు. నిపుణులు, వనరులు ఉన్న చోటుకే అవకాశాలు వెతుక్కుంటూ వచ్చే రోజులు వచ్చాయని, త్వరలోనే 'రివర్స్ మైగ్రేషన్' (తిరుగు వలస) ప్రారంభమవుతుందని ఆయన జోస్యం చెప్పారు. నవ్యాంధ్రను డేటా సెంటర్ల హబ్‌గా మార్చేందుకు గ్రీన్ ఎనర్జీని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. భారత్ ప్రస్తుతం సింగిల్ గ్రిడ్ ద్వారా ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్ సాధిస్తోందని, భవిష్యత్తులో దేశం విద్యుత్తును ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గణపతి కూడా లొంగిపోవాలి.. ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రైఫిళ్లు ఉన్నాయి. వీటితో పాటు 5,205 తూటాలు, 9ఎఎ పిస్టల్స్ , ఇతర పేలుడు పదార్థాలను కూడా వారు సమర్పించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, 10 మంది డివిజనల్ కమిటీ సభ్యులతో పాటు 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మావోయిస్టుల లొంగుబాటును సాదరంగా ఆహ్వానించారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా చర్చల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. లొంగిపోయిన వారందరి ఆర్థిక , ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పూర్తి హామీ ఇస్తుందని, సొంత గ్రామాల్లో వారు స్థిరపడటానికి ఇళ్ల నిర్మాణంతో పాటు తగిన ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అజ్ఞాతంలో ఉన్న ఇతర మావోయిస్టులు, ముఖ్యంగా కీలక నేత గణపతి వంటి వారు కూడా బయటకు రావాలని, ఆయన ప్రాణాలకు , ఆరోగ్యానికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని సీఎం ఒక బహిరంగ పిలుపునిచ్చారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచనల మేరకు ఆయుధాలతో లొంగిపోయే వారికి అత్యుత్తమ పునరావాసం కల్పిస్తామని, ప్రజాస్వామ్య పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించుకుందామని సీఎం స్పష్టం చేశారు.




## రాష్ట్రపతిని అవమానించడం సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి పరిణామం ఇప్పుడూ జరగలేదని చెప్పారు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని హద్దులూ దాటేసిందని ధ్వజమెత్తారు. బెంగాల్‌లో రాష్ట్రపతి పాల్గొన్న సంథాల్ సదస్సు వేదికను రాష్ట్ర ప్రభుత్వం హఠాత్తుగా మార్చేసింది. ఈ విషయాన్ని ద్రౌపదీ ముర్ము తప్పుపట్టారు. తన అసంతృప్తిని వ్యక్తంచేశారు. అలాగే ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమె మంత్రివర్గ సభ్యులు కూడా తన పర్యటన సందర్భంగా హాజరు కాకపోవడాన్ని ముర్ము ఆక్షేపించారు. ఈ పరిణామాలపై మోదీ శనివారం 'ఎక్స్'లో స్పందించారు. రాష్ట్రపతి పదవి రాజకీయాలకు అతీతం అని గుర్తుచేశారు. ఆ పదవికి ఉన్న ప్రతిష్టను ఎల్లప్పుడూ గౌరవించాలన్నారు. బెంగాల్ ప్రభుత్వ చర్యతో ప్రజాస్వామ్యవాదులు, గిరిజనుల మనోభావాలు గాయపడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజన మహిళ అయిన ద్రౌపదీ ముర్ము ఆవేదన విని దేశ ప్రజల హృదయాలు బాధతో నిండిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రపతిని కించపర్చారని, దీనికి బెంగాల్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని మోదీ తేల్చిచెప్పారు. బెంగాల్ ప్రభుత్వానికి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఇకనైనా సద్బుద్ధి కలుగుతుందని ఆశిస్తున్నట్లు స్పష్టంచేశారు. సంథాల్ సంస్కృతిపై జరిగిన గొప్ప సదస్సును బెంగాల్ సర్కార్ తేలిగ్గా తీసుకోవడం దురదృష్టకరమని ప్రధానమంత్రి వెల్లడించారు.

### రాష్ట్రపతిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తారా?: మమత

బీజేపీ సలహా మేరకే రాష్ట్రపతి ముర్ము నడుచుకుంటున్నారని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శించారు. మణిపూర్, చత్తీస్‌గఢ్‌లో గిరిజనులపై దాడులు జరిగితే ముర్ము ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బెంగాల్‌లో గిరిజనుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదని రాష్ట్రపతి ఆరోపించడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రపతిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తారా? అంటూ బీజేపీపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రపతి పట్ల తమకు ఎనలేని గౌరవం ఉందన్నారు. ముర్ము పాల్గొన్న సదస్సు వేదికను మార్చేసిన సంగతి తనకు తెలీదని మమత చెప్పారు. ఆ సదస్సును ఎవరు నిర్వహించారో, ఎవరు నిధులిచ్చారో తెలియదని అన్నారు. రాష్ట్రపతి ఏడాదికి ఒకసారి బెంగాల్‌కు వస్తే తాను స్వాగతిస్తానని పేర్కొన్నారు. కానీ, తరచుగా వస్తూ ఉంటూ ప్రతిసారీ స్వాగతించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఎల్లప్పుడూ రాష్ట్రపతి వెంట ఉండడమే మా పనా? అని వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో గిరిజనుల ఓట్లు తొలగించిన విషయం ముర్ముకు తెలుసా? అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి రాష్ట్రపతిని బీజేపీ ఉపయోగించుకుంటోందని మమతా బెనర్జీ ఆరోపించారు.

## కర్ణుడు కాదు కుంభకర్ణుడు, మహాక్రూరుడు

(మొదటి పేజీ తరువాయి)

తన కవచ కుండలాలను కూడా దానం చేసిన త్యాగధనుడని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల గుండెల మీద తన్నే దుర్మార్గుడని అన్నారు. రేవంత్ రెడ్డి కర్ణుడిలాంటి వాడే అయితే రైతు బంధు ఏది, ఇళ్లు కూలగొట్టి విధ్వంసం సృష్టించడం ఎందుకని నిలదీశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా మారిస్తే రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టారని మండిపడ్డారు. 24 గంటల విద్యుత్, ఆరు గ్యారెంటీ హామీల అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. కేసీఆర్ అభివృద్ధికి కేరాఫ్ అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసానికి కేరాఫ్ అని విమర్శించారు. రేవంత్ రెడ్డికి విమర్శలు చేయడంపై ఉన్న దృష్టి రైతుల కష్టాల మీద లేదని అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అభివృద్ధి అంటే ఏమిటో చూపించామని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదని విమర్శించారు. హైడ్రా పేరుతో, మూసీ సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పేదల ఇళ్లను కూల్చుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డిని కుంభకర్ణుడితో పోల్చవచ్చని హరీశ్ రావు అన్నారు. ఎందుకంటే ఎన్నికలు రాగానే ఆయన నిద్రలేస్తారని, ఎన్నికలయ్యాక కేసీఆర్, బీఆర్ఎస్ మీద నిందలు వేయడమే రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. కరోనా సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు వేసిందని గుర్తు చేశారు.




## గురుకుల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

- 372 మందికి తనిఖీలు.. స్కేబిస్‌పై అవగాహన

**రాజపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్):** ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం రాజపేటలోని గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే బృందం డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కవిత ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. శిబిరంలో దంత, నేత్ర, చర్మ సంబంధిత వైద్య నిపుణులు మొత్తం 372 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి విద్యార్థులకు స్కేబిస్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారి డాక్టర్ మోస్సెస్ రాజ్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ భిక్యా నాయక్, సూపర్వైజర్ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్, పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, హెల్త్ సూపర్వైజర్ భాస్కర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'నిషేధిత' ఇళ్లను క్రమబద్ధీకరించాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా
- మెమోరాండం అందజేత



**యాదగిరిగుట్ట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లి, బీసీ కాలనీ, ఇందిరా కాలనీలలో పేదలకు కేటాయించిన 762 ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చిన ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసి వాటిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాపట్ల నరహరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. పేదలకు కేటాయించిన ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వారు ఆ ఇళ్లను అవసరాలకు ఉపయోగించుకోవడం, వాటిపై బ్యాంకు రుణాలు పొందడం వంటి అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. పేదలకు ఇచ్చిన ఇళ్లను వెంటనే రెగ్యులర్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో పది రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించకపోతే స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో పాటు కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాదాద్రి క్షేత్రాన్ని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



**యాదగిరిగుట్ట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ శనివారం కుటుంబ సమేతంగా యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ అర్చకులు పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. దర్శనం అనంతరం దేవస్థానం ఈవో భవాని శంకర్ న్యాయమూర్తి లక్ష్మీనారాయణకు స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి లడ్డూ ప్రసాదం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, శ్రీనాథ్ ఆచార్యులు, వజ్రాల లక్ష్మణాచార్యులు, వేద పండితులు, ఆలయ అధికారులు, ఏఈఓ రఘు, సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున గ్రూప్ ఆఫ్ స్కూల్స్ శారదా విద్యానికేతన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

**గండిపేటమార్చి 7 (తొలివెలుగు న్యూస్):** నాగార్జున గ్రూప్ ఆఫ్ స్కూల్స్ శారదా విద్యానికేతన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్ ఉషారాణి హజరైయ్యారు. మహిళల గొప్పతనాన్ని ప్రశంసించారు. స్కూల్ కరస్పాండెంట్‌ను, ప్రిన్సిపల్‌ను గజమాలతో తస్కరించారు. ఈ సందర్భంగా టీచర్స్‌కు ఫన్ గేమ్స్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- రామన్నపేట ఎస్సీ బాలుర వసతి గృహంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- వంటగది, డైనింగ్ హాల్, బెడ్స్ పరిశీలించిన కలెక్టర్
- ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఆదేశాలు
- హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచన
- విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆదేశాలు









**రామన్నపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. శనివారం రామన్నపేట మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వంటగది, డైనింగ్ రూమ్, విద్యార్థులు పడుకునే పడకలను పరిశీలించారు. డైనింగ్ రూమ్ శుభ్రంగా లేదని గమనించిన కలెక్టర్ ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులకు వండే ఆహారం పరిశుభ్రంగా తయారు చేయాలని సూచించారు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. అదేవిధంగా మంచినీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్.ఓ ప్లాంట్‌ను పరిశీలించి విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల 'గ్రీన్' గర్జన







- వేతనాలు నేరుగా ఖాతాల్లో వేయాలని డిమాండ్..
- సర్క్యులర్ ప్రతుల దహనం

**రామన్నపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలను నేరుగా ప్రభుత్వమే గ్రీన్ ఛానల్ ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రామన్నపేట మండల గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మండల పంచాయతీ అధికారి రఫుఫ్ అలీకి వినతి పత్రాన్ని అందజేశారు. తరువాత స్థానిక సుభాష్ సెంటర్‌లో ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నకిరేకంటి రాము మాట్లాడుతూ.. గత సంవత్సరం సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయకుండా గ్రామపంచాయతీ కార్మికుల జీవితాలతో ఆటలాడుతోందని ఆరోపించారు. నెలల తరబడి పనిచేసినప్పటికీ జీతాలు అందక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించడంతో పాటు కార్యదర్శులు, సర్పంచ్‌లకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల వివరాలను వెంటనే నమోదు చేసి వారికి కూడా జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్మికులకు ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోతే మరోసారి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం, గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బందేల భిక్షం, మేడి రామచంద్రం, మంచాల రేణుక, నల్ల సుగుణమ్మ, మంటి నాగరాజు, మంటి అంజయ్య, పుట్ట నాగరాజు, ఉక్కుర్తి లచ్చమ్మ, జయమ్మ, కొమ్ము కవిత, బల్గురు చందన, శంకరమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ-పురుష సమానత్వమే సమ సమాజానికి పునాది

- రాజపేటలో ఘనంగా మహిళా దినోత్సవం..
- మహిళా ఉద్యోగులకు ఘనంగా సన్మానం




**రాజపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్):** మహిళల అభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాజపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. నాగవేణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలపై వివక్ష తగదని, స్త్రీ - పురుష సమానత్వం సాధించడమే సమ సమాజ నిర్మాణానికి పునాదిగా నిలుస్తుందని అన్నారు. స్త్రీ జాతి అభ్యున్నతి కోసం ఎన్నో చట్టాలు వచ్చినప్పటికీ వాటి అమలులో ఇంకా కొంత అలసత్వం కొనసాగుతోందని పేర్కొన్నారు. మహిళలపై దోపిడి, పీడన, అణిచివేత, వివక్ష లేని సమాజం నిర్మాణానికి ప్రభుత్వాలతో పాటు పౌర సమాజం కూడా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అదనపు పీడీ సురేష్, తహసిల్దార్ వల్లపు ప్రదీప్, ఎంపీఓ కిషన్, ఎంఈఎఫ్ జిల్లా నాయకుడు ఇంజ మహేష్, మహిళా ఉద్యోగులు కె. సురేఖ, కె. సరస్వతి, వి. ఉపేంద్ర, జి. కవిత, వరిమడ్ల ఉపేంద్ర, ఉమ, మంగమ్మ, కార్యాలయ ఉద్యోగులు విజయ్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఎంపీడీఓ కార్యాలయంలో శ్రమదానం

- పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: ఎంపీడీఓ కిషన్
- చెత్తాచెదారం తొలగించిన అధికారులు, సిబ్బంది

**రాజపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం రాజపేట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఆవుల కిషన్ స్వయంగా పాల్గొని కార్యాలయ పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, స్వచ్ఛతే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోయ మధు, ఉపసర్పంచ్ కేదారి గౌడ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి సాయిలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మల్లగూడెం చెంతకే రేషన్ బియ్యం

- సర్పంచ్ చొరవతో తీరిన కష్టాలు.
- తాత్కాలిక దుకాణం ఏర్పాటు.. సంతోషంలో లబ్ధిదారులు

**రాజపేట, మార్చి 7 (తొలివెలుగు):** రాజపేట మండలం మల్లగూడెం గ్రామంలో తాత్కాలిక చౌకధర దుకాణం ఏర్పాటు చేశారు. శనివారం గ్రామ లబ్ధిదారులు అవసరమైన బియ్యాన్ని స్వయంగా పాముకుంట రేషన్ దుకాణం నుంచి గ్రామానికి తరలించుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 50 బస్తాల బియ్యాన్ని గ్రామానికి తీసుకువచ్చి పంపిణీకి సిద్ధం చేశారు. గ్రామంలో తాత్కాలిక రేషన్ షాపు ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ దుకాణం ఏర్పాటుకు సహకరించిన అధికారులతో పాటు కృషి చేసిన గ్రామ సర్పంచ్ జన్నపల్లి బాలరాజు రెడ్డికి లబ్ధిదారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరినా
- మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా అధికారులకు సన్మానం



**హుజూర్‌నగర్, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరినా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని జీవీపీ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు అట్లూరి మంజుల, దొంతిరెడ్డి పద్మ, కోలా ఉదయభాను, అమరబోయిన ఊహ, కల్వకుంట్ల మాధవి ఆధ్వర్యంలో మహిళా అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరినా మాట్లాడుతూ.. భారత రాజ్యాంగంలో మహిళలకు అనేక ప్రత్యేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. మహిళలు ఎక్కడైనా వేధింపులకు గురైతే చట్టాలను వినియోగించుకొని న్యాయం పొందాలని సూచించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలు ముందుండాలని, కుటుంబ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు అందరూ కృషి చేయాలని, చదువుకుని ఉన్నత స్థాయిలను అందుకోవాలని ఆమె కోరారు. రాజకీయాల్లో కూడా అనేక మహిళలు తమ ప్రతిభను చాటుకుంటున్నారని అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక, తహసిల్దార్ బండ కవిత, ఎంపీఓ లావణ్యలను సన్మానించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్ రావు, కమిషనర్ శ్రీనివాసు, కౌన్సిలర్లు సంపత్ రెడ్డి, జ్యోతి, లలిత, నాగలక్ష్మి, కామేశ్వరి, ధనమ్మ, సావిత్రి, భద్రమ్మ, సుజాత, వెంకటరెడ్డి, కవిత, సంధ్య, బాబురావు, సతీష్, విజయ, ప్రసాద్, చందు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర రూప శిల్పులు.. ఆదర్శ మహిళా మూర్తులు

- మాకొడి ఉన్నత పాఠశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**అనంతపురం, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లా మాకొడి ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే శనివారం పాఠశాల ఆవరణలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులు రమాదేవి, ఉషారాణి, శిరీషలను సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల క్రమశిక్షణలో వారు చేస్తున్న సేవలను అభినందిస్తూ శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ నాగిరెడ్డి, ఉపాధ్యాయులు ఓబులేష్, నాగభూషణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక చేత్తో కుటుంబాన్ని, మరో చేత్తో దేశ భవిష్యత్తైన విద్యార్థులను తీర్చిదిద్దే గొప్ప శక్తి మహిళలదని అన్నారు. చదువు చెప్పడమే కాకుండా తల్లిలా ప్రేమతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న మహిళా ఉపాధ్యాయులకు ఈ గౌరవం దక్కడం గర్వకారణమని తెలిపారు. మహిళా సాధికారతకు నిదర్శనంగా నిలిచే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మహిళల పట్ల గౌరవాన్ని మరింత పెంచుతాయని పేర్కొన్నారు.

# కంబాల కానుక వనితలకు వేడుక'తో వెలంపేట పులకింత

**రాజమహేంద్రవరం మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం మండలం వెలంపేట గ్రామంలో శుక్రవారం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ధన దుర్గ అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో "కంబాల కానుక వనితలకు వేడుక" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మొదటగా ఆయన సీతానగరం గ్రామంలోని మావుళ్ళమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారిపై తనకున్న భక్తిని చాటుకుంటూ రూ.10 లక్షల వ్యయంతో తయారు చేయించిన 3.5 కిలోల బరువైన వెండి కిరీటాన్ని అమ్మవారికి సమర్పించారు. అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి కిరీట ధారణ చేశారు.అనంతరం వెలంపేటలో కొలువైన ధన దుర్గ అమ్మవారిని దర్శించి ప్రత్యేక హారతులు సమర్పించారు.

# ప్రజాపాలన ప్రగతి.. పకడ్బందీగా అమలు



- క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- పెండింగ్ దస్త్రాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశం
- సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల భాగస్వామ్యంపై కసరత్తు
- ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నిర్ణయం

**నల్గొండ / యాదాద్రి భువనగిరి, మార్చి 7 (తొలివెలుగు న్యూస్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. శనివారం నల్గొండలోని ఉదయాదిత్య భవన్‌లో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికపై ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల పాటు చేపడుతున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి వారికి దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో కార్యాచరణను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపాలిటీలు, మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించేలా కృషి చేస్తున్నా మని తెలిపారు. వైద్య, ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు త్వరలో ప్రారంభమయ్యే ధాన్యం కొనుగోలు సీజన్ సజావుగా సాగేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, సర్పంచులను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ అధికారులు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.









# వ్యవసాయంలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

**- ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత**

**వలిగొండ, మార్చి 7 (తొలివెలుగు న్యూస్):** వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత తెలిపారు. శనివారం వలిగొండ మండలంలోని వేములకొండ రైతువేదికలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ కార్యక్రమంలో ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి, పత్తి పంటల యాజమాన్య పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం ప్రయోజనాలు, నానో యూరియా వినియోగం గురించి వివరించారు. అలాగే విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక సాంద్రత పత్తి సాగు విధానం, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. నిషేధిత హెచ్‌టీ పత్తి విత్తనాల వల్ల కలిగే నష్టాలను కూడా రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి పచ్చి రొట్టె ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్ ఏర్పుల కలమ్మ యాదయ్య, వేములకొండ గ్రామ ఉపసర్పంచ్ సాయికుమార్, ఏఈవోలు భగీరథ, సాయి, రైతులు పాల్గొన్నారు.

# ఐరా పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు

- మహిళల సాధికారతతోనే సమాజాభివృద్ధి: పాఠశాల చైర్మన్ అరుణ



**చౌటుప్పల్, మార్చి 7 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ పట్టణంలోని ఐరా గ్లోబల్ స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ అరుణ, కరస్పాండెంట్ శ్రీకాంత్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం పురోభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మహిళా హక్కులు, సమానత్వంపై చేసిన ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులను యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాపూజీ డాక్యుమెంటరీ 'యూనిటీ'కి గద్దర్ అవార్డు

- డాక్యుమెంటరీ విభాగంలో తొలి ఉత్తమ చిత్రంగా 'యూనిటీ' ఎంపిక
- దర్శకుడు బడుగు విజయ్ కుమార్‌కు 'గద్దర్' పురస్కారం
- కొండా లక్ష్మణ్ బాపూజీ బయోపిక్‌కు అరుదైన గౌరవం




**హైదరాబాద్ / చౌటుప్పల్ మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** తెలంగాణ జాతిపిత, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆధారంగా రూపొందిన 'యూనిటీ ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్' డాక్యుమెంటరీకి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులులో గద్దర్ అవార్డు లభించింది. 2025 సంవత్సరానికి సంబంధించిన అవార్డుల్లో డాక్యుమెంటరీ విభాగంలో ఉత్తమ చిత్రంగా ఈ డాక్యుమెంటరీ ఎంపికైంది. యువ దర్శకుడు బడుగు విజయ్ కుమార్ తెరకెక్కించిన ఈ డాక్యుమెంటరీని చిరందాస్ శ్రీకాంత్ నిర్మించాడు. అవార్డు విషయాన్ని డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్స్ విభాగ జ్యూరీ చైర్మన్ విజయ్ కనకమేడల ఎఫ్‌డీసీ కార్యాలయంలో అధికారికంగా ప్రకటించాడు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం, ఆయన సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం, తెలంగాణ సమాజంలో ఆయన పాత్రను ఆసక్తికరంగా ఈ డాక్యుమెంటరీలో చూపించారు. పెద్దల నుంచి పాఠశాల విద్యార్థులకు కూడా సులభంగా అర్థమయ్యేలా కథనం రూపొందించడంపై జ్యూరీ సభ్యులు ప్రశంసలు వ్యక్తం చేశారు. డాక్యుమెంటరీలో మైమ్ మధు, బాలనటుడు మాస్టర్ భాను ప్రధాన పాత్రలు పోషిస్తూ బాపూజీ జీవితం, ఆయన సిద్ధాంతాలను ప్రతిబింబించారు. బాల్యం నుంచి మరణం వరకు జరిగిన సంఘటనలను స్పష్టంగా చూపించడమే కాకుండా, తెలంగాణ సాధన వరకు జరిగిన పరిణామాలను వినూత్నంగా చిత్రీకరించడం ప్రత్యేకతగా నిలిచింది. నాణ్యమైన విజువల్స్, స్పష్టమైన వాయిస్ ఓవర్, సమర్థమైన ఎడిటింగ్‌తో సుమారు అరగంట నిడివితో డాక్యుమెంటరీ రూపొందింది. ఇప్పటికే ఈ డాక్యుమెంటరీ పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు పొందింది. భారత్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్లో 'యూనిటీ' డాక్యుమెంటరీకి బెస్ట్ హిస్టారికల్ డాక్యుమెంట్ ఫిల్మ్, ఐకానిక్ ఫ్రెండ్ ఆఫ్ ఇండియా అవార్డులు లభించాయి. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల దర్శకుడు విజయ్ కుమార్, నిర్మాత శ్రీకాంత్ ఆనందం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడి చరిత్రను గుర్తించి ప్రోత్సహించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుకు ఎంపిక చేసిన జ్యూరీ చైర్మన్ విజయ్ కనకమేడలతో పాటు జ్యూరీ సభ్యులకు దర్శకుడు, నిర్మాతతో పాటు నటీనటులు మైమ్ మధు, మాస్టర్ భాను ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




## వీధి కుక్కల తరలింపు.. ఇక కోతుల వంతేనా?

- వాహనదారుల ఫిర్యాదుతో స్పందించిన పంచాయతీ అధికారులు

**రాజపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** గ్రామాల్లో వీధి కుక్కలు, కోతుల సమస్య ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా వేగంగా పరిగెత్తే కుక్కల కారణంగా వాహనదారులు తరచూ కిందపడుతూ ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను గ్రామపంచాయతీ గ్రామసభల్లో పాలకవర్గానికి తెలియజేయడంతో అధికారులు స్పందించి వీధి కుక్కలను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం రాజపేటలో కుక్కలను పట్టుకుని ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలు ఉన్నవారు వాటిని బయటకు వదలకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అయితే గ్రామాల్లో కోతుల బెడద కూడా అధికంగా ఉందని, వాటి సమస్యను కూడా త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహూకరణ



- రఘునాథపురం బడికి 'సౌండ్' సోయగం
- చిన్న గౌరాయపల్లి సర్పంచ్ దాతృత్వం

**రాజపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్):** యాదగిరిగుట్ట మండలం చిన్న గౌరాయపల్లి గ్రామ సర్పంచ్ భోగ లక్ష్మీనారాయణ శనివారం రాజపేట మండలం రఘునాథపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.26 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. ఈ సౌండ్ సిస్టమ్‌ను మండల విద్యాధికారి చందా రమేష్, రఘునాథపురం గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకట నరసమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి చందా రమేష్, సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ మాట్లాడుతూ.. పాఠశాలలో కనీస సౌకర్యాలు మెరుగుపర్చాలనే ఉద్దేశంతో తన దాతృత్వాన్ని చాటుకున్న చిన్న గౌరాయపల్లి సర్పంచ్ భోగ లక్ష్మీనారాయణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కలకుంట్ల కవిత, ఉపాధ్యాయులు సోమ సత్తిరెడ్డి, ఎలగందుల వెంకటేష్, జూకంటి కరుణాకర్, చింతకింది శ్రీనివాస్, కీర్తి సరిత, ఇండ్ల రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడుల బలోపేతమే లక్ష్యం

- బడిబాటపై ఎంఈఓ కసరత్తు
- ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం
- విద్యార్థుల నమోదుపై సమిష్టి కృషి అవసరం



**రాజపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** 202627 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయ సంఘాలు సమిష్టిగా కృషి చేయాలని మండల విద్యాధికారి చందా రమేష్ అన్నారు. శనివారం రాజపేట మండలంలోని మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఈఆర్సీ)లో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు ఉపాధ్యాయులు ముందుండాలని సూచించారు. వేసవి సెలవులకు ముందే బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుల సహకారం తీసుకోవాలని సూచించారు. దీనికోసం ఉపాధ్యాయులు, సర్పంచ్‌లతో కలిసి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో రఘునాథపూర్ కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కె. మనోజ్ కుమార్ పాల్గొని పలు సూచనలు చేశారు. పీఆర్టీయూ నుంచి ఎస్. సుబ్బరాజు, జి. బాలరాజు, టపస్ (టీయూపీఎస్) నుంచి డి. జానయ్య, పి. సత్యానంద్, యూటీఎఫ్ నుంచి ఎస్. మధుసూదన్, జె. మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార పంపిణీ...!

**జగిత్యాల (తొలివెలుగు న్యూస్) :** పట్టణంలోని 4వ వార్డు చిలుకవాడ అంగన్వాడీ కేంద్రంలో శనివారం వార్డు కౌన్సిలర్ క్యాదసు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పోషకాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు బాల అమృతం మరియు కోడిగుడ్లను పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణీ స్త్రీలకు టీటీ ఇంజక్షన్లు వేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సేవలు, లబ్ధిదారుల వివరాలను నమోదు చేసే ఎన్.హెచ్.టి.ఎస (బీయూ), పోషణ్ ట్రాకర్ యాప్‌ల పనితీరును కౌన్సిలర్ గారికి సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో పిల్లల ఎత్తు, బరువులు తీసి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ క్యాదసు నవీన్ కుమార్, సిడిపిఓ మమత, రాగుల పరశురాం, కస్తూరి నరేష్, ఏఎన్ఎం పద్మ, అంగన్వాడీ టీచర్ జ్యోతి, ఆశా వర్కర్లు వసంత, సంధ్య మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కలెక్టర్ సీరియస్

- వాల్టా చట్టం అమలు లో నిర్లక్ష్యం సహించం
- అక్రమ రవాణా వాహనాల సీజ్‌కు ఆదేశాలు
- ఫిల్టర్ సాండ్ అక్రమ వ్యాపారంపై గట్టి నిఘా
- ఇసుక కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- రెవెన్యూ, పోలీస్, మైనింగ్ సంయుక్త దాడులు చెయ్యాలి
- భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి వేగం పెంచాలి
- జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై విస్తృత అవగాహన
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు ఆదేశాలు




**సంగారెడ్డి, (తొలివెలుగు న్యూస్) :** జిల్లాలో అక్రమంగా ఇసుక, కంకర, గ్రావెల్ రవాణాను కట్టుదిట్టంగా నియంత్రించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వాల్టా చట్టంతో పాటు మోటార్ వాహనాల చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని సూచించారు. శనివారం సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, భూగర్భజల శాఖ అధికారులతో అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణా నివారణపై చర్చించారు. జిల్లాలో వాల్టా చట్టం అమలు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అవగాహన, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, ఎస్ఐఆర్ నమోదు వంటి అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇసుక, కంకర అక్రమ రవాణాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణాలో పాల్గొనే వాహనాలను సీజ్ చేసి మోటార్ వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫిల్టర్ సాండ్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. సహజ ఇసుకకు బదులుగా కృత్రిమంగా ఇసుక తయారు చేసి విక్రయించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన ఇసుకను నిర్ణీత ధరలకే అందిస్తున్నందున దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నారాయణఖేడ్, జోగిపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ల ద్వారా ఇసుకను నిర్ణీత ధరలలో అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి జిల్లాలో ఇసుక కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వినియోగానికి తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని సూచించారు. మొరం, గ్రావెల్ తవ్వకాలపై సాంకేతికంగా తనిఖీలు నిర్వహించి తవ్వకాల వివరాలను పరిశీలించాలని తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసిన అక్రమ రవాణా కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కుల, ఆదాయ, నివాస ధృవపత్రాల జారీ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం పై మండల, గ్రామ స్థాయిలలో విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా భూగర్భ శాఖ అధికారి ఎం. రఘుబాబు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి నీటితో చెరువులు నింపండి



- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు సర్పంచులు, రైతుల విన్నపం

**రాజపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** వేసవి ప్రారంభ దశలోనే బోరు బావులు ఎండిపోతుండడంతో గోదావరి జలాలతో చెరువులు నింపి రైతులను ఆదుకోవాలని రాజపేట మండలంలోని సర్పంచులు, రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం పాముకుంట, పుట్టగూడెం, కొండ్రెడ్డిచెరువు, మల్లగూడెం గ్రామాల సర్పంచులు, రైతులు అఖిలపక్షం ఆధ్వర్యంలో సుమారు 60 మంది రైతులతో కలిసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజపేట మండలంలో ప్రతి వేసవికాలంలో పంట పొలాలు నీటి కొరతతో ఎండిపోత ున్నాయని తెలిపారు. ఈ ఏడాది చెరువులు నిండుతాయనే ఆశతో నారుపోసి నాట్లు వేసినప్పటికీ ఫిబ్రవరి రెండో వారంలోనే చెరువులు ఎండిపోవడంతో పంటలు వాడిపోతున్నాయని వాపోయారు. ఒక ఎకరాకు సుమారు రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. 15 ప్యాకేజీ కింద జగదేవ్‌పూర్ నుండి మొల్ల చెరువు వరకు కాలువ ద్వారా త్వరగా చెరువులు నింపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాముకుంట సర్పంచ్ రంగ నరేష్, పుట్టగూడెం సర్పంచ్ రాంజీ నాయక్, కొండ్రెడ్డిచెరువు సర్పంచ్ ఉప్పరి నరేష్, మల్లగూడెం సర్పంచ్ జన్నెపల్లి బాలరాజు రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ విట్టల్ నాయక్, లచ్చా నాయక్, ఉపసర్పంచ్ రాజు, దేవుల నాయక్, రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచ్ వీరస్వామి, సాయిలు, మాన్య నాయక్, నరసింహ నాయక్, భూక్యా భంగి నాయక్, చందు నాయక్, పాండు గౌడ్, పెద్దులు, కుమార్ నాయక్, జయరాములు, శేఖర్, సంతోష్, గ్రామశాఖ అధ్యక్షులు నర్సింలు, రవి, ఉప్పరి సత్యనారాయణ తదితర రైతులు పాల్గొన్నారు.



## మాధవరెడ్డి సేవలు చిరస్మరణీయం

- ఘనంగా మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి వర్ధంతి వేడుకలు
- నివాళులర్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** దివంగత మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు వం ఁ ం వ లే ని వ ని చౌటుప్పల్ పురపాలక చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. మాధవరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం చౌటుప్పల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి ఎలిమినేటి మాధవరెడ్డి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ స్మరణీయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య, సామిడి రాఘవరెడ్డి, కొసనం రాకేష్ రెడ్డి, ఊడుగు జ్యోతి, పిల్లలమర్రి మధుసూదన్, ఎండి హనుబాయ్, వెలుగ రాజశేఖర్ రెడ్డి, చిన్నగోని అంజయ్య గౌడ్, చామకూర రాజయ్య, బొంగు శీను గౌడ్, సుర్కంటి బాలకృష్ణారెడ్డి, వెంకటేష్, సురేష్ తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు, మాధవరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

# ఇసుకపై పంచాయతీల గుత్తాధిపత్యం..?

- నిలిచిన ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలు
- వాగులు లేని 14 గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకాలు
- అయోమయంలో పలు గ్రామాల ప్రజలు



**రాజపేట, మార్చి 7 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలంలో వాగులు ఉన్న కొన్ని గ్రామపంచాయతీలు ఇసుక రవాణాపై నిషేధ తీర్మానాలు చేయడంతో వాగులు లేని గ్రామాల్లో నిర్మాణ, అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మండలంలో మొత్తం 25 గ్రామపంచాయతీలు ఉండగా, వాటిలో 11 గ్రామాల పరిధిలో మాత్రమే వాగులు ఉండగా మిగతా 14 గ్రామాలకు వాగులు లేవు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నూతన పాలకవర్గాలు గ్రామసభల్లో ఇసుక రవాణాపై తీర్మానాలు చేపట్టాయి. తమ గ్రామాలకు మాత్రమే ఇసుక రవాణా చేసుకోవాలని, ఇతర గ్రామాలకు అనుమతి ఇవ్వబోమని నిర్ణయించి ఆ తీర్మానాలను సంబంధిత అధికారులకు పంపించారు. దీంతో




వాగులు లేని 14 గ్రామపంచాయతీలలో ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇసుక అనుమతి కోసం ఆ గ్రామాల ప్రజలు రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయించినప్పటికీ స్పష్టత లేక నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది. పరిస్థితి విషమించకముందే, అక్రమంగా ఇసుక రవాణా జరిగే అవకాశాలను నివారిస్తూ అన్ని గ్రామాలకు సమానంగా ఇసుక అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాగులు లేని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# డబ్బింగ్ స్టూడియోలో ఉస్తాద్ భగత్ సింగ్..

పవన్   పవన్ కల్యాణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ ఉస్తాద్ భగత్ సింగ్  హరీష్ శంకర్ (ఝుతీఅంష్ట్ర ంష్ట్రఝుఅఝుతీ) డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్ర పోషిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది.  ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేయబోతున్నట్టు మేకర్స్ తెలియజేశారు. ఈ క్రేజీ న్యూస్‌ను ఇప్పటికే అభిమానులు ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. కాగా ఈ చిత్రాన్ని మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది పవన్ కల్యాణ్ టీం. తాజాగా అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చాడు పవన్ కల్యాణ్. ఉస్తాద్ భగత్ సింగ్ కోసం డబ్బింగ్ మొదలు పెట్టాడు. పవన్ కల్యాణ్ స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న స్టిల్‌ను మేకర్స్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. పవన్ కల్యాణ్‌తోపాటు డైరెక్టర్ హరీష్ శంకర్, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ ను కూడా చూడొచ్చు. మొత్తానికి రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో పవన్ కల్యాణ్ టీం ఏదో అప్‌డేట్‌తో అభిమానులను ఖుషీ చేస్తూ క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ సాంగ్స్ నెట్టింటిని షేక్ చేస్తున్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ పవన్ కల్యాణ్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి.గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.



# ఆ ఇంట్లో నాకూ హక్కుంది.. నటుడు విజయ్‌పై భార్య సంగీత మరో పిటిషన్

ప్రముఖ తమిళ నటుడు, 'తమిళగ వెట్రి కళగం' అధినేత విజయ్‌కు ఆయన భార్య సంగీత నుంచి మరో కొత్త షాక్ తగిలింది. వీరిద్దరి మధ్య జరుగుతున్న విడాకుల వివాదంలో తాజాగా ఆమె చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో ఒక కీలక పిటిషన్‌ను దాఖలు చేసింది. విడాకుల కేసు విచారణ పూర్తయ్యే వరకు చెన్నైలోని నీలంకరైలో ఉన్న తమ సొంత నివాసంలోనే ఉండేందుకు అనుమతి ఇవ్వాలని ఆమె కోర్టును కోరింది. ఒకవేళ విడాకుల ప్రక్రియతో ముందుకు వెళ్తే ఆ ఇంటిని ఖాళీ చేయాలని విజయ్ తరపు న్యాయవాదులు తనను హెచ్చరించారని, అయితే బ్రిటీష్ పౌరసత్వం కలిగిన తనకు చెన్నైలో ప్రత్యామ్నాయ నివాసం లేదని సంగీత పేర్కొన్నారు. విజయ్ హోదాకు తగినట్లుగా తన పిల్లలతో కలిసి ఆ ఇంట్లో నివసించే హక్కు తనకు ఉందని ఆమె తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. విజయ్‌కు ఒక ప్రముఖ నటితో ఉన్న సంబంధమే ఈ గొడవలకు కారణమని, దీనివల్ల 2021 నుంచి తాను తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నానని సంగీత ఆరోపించారు. విడాకుల సెటిల్‌మెంట్‌లో భాగంగా భారీ మొత్తంలో భరణం కూడా కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించి ముఖ్యమంత్రి అభ్యర్థిగా సిద్ధమవుతున్న తరుణంలో, ఈ వ్యక్తిగత వివాదం రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పిటిషన్‌పై స్పందించిన కోర్టు విజయ్‌కు నోటీసులు జారీ చేసింది, తదుపరి విచారణను 2026, ఏప్రిల్ 20కి వాయిదా వేసింది.





# ఆ రోజు రావాలి

సోషల్‌మీడియాలో తరచూ ట్రోలింగ్ ఎదుర్కొనే నటి, యాంకర్ అనసూయ ఇటీవల హోలీ సంబరాల్లో పాల్గొన్న విషయం తెలిసిందే. అక్కడ ఆమె మాట్లాడుతున్న సమయంలో కొందరు ఆంటీ.. ఆంటీ.. అంటూ గట్టిగా కేకలు వేయడం.. అందుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. కొందరు ఆ వీడియోకు వచ్చిన కామెంట్స్ తో రీల్స్ కూడా చేశారు. దీంతో ఆ రీల్స్ గురించి నటి పోస్ట్ పెట్టింది. వయసును బట్టి హేళన చేయడం, మహిళలపై వివక్ష చూపడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. అందరూ నాకెందుకులే అని వదిలేస్తూ వెళ్తే ఇలాంటివి సాధారణం అవుతాయని చెప్పింది. తాను ఉన్నది ఉన్నట్లు చెప్పడానికి మొహమాట పడనని, ఇతరుల బాధలో కూడా వినోదం వెతికే వారిని, కనీస సానుభూతి, సామాజిక బాధ్యత లేని వారిని సమాజం నిలదీసే రోజు రావాలని పేర్కొంది.



# బర్త్ డే ట్రీట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'పెద్ది'. ఉప్పెన సంచలనం తర్వాత డైరెక్టర్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తోన్న రెండో సినిమా ఇది. దీంతో ఇప్పటికే ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ పై భారీగా హైప్ నెలకొంది. ఇందులో అచ్చియ్యమ్మ పాత్రలో  బాలీవుడ్ అందాల భామ జాన్వీ కపూర్ నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇవాళ ఆమె పుట్టినరోజు సందర్భంగా డైరెక్టర్ స్పెషల్ వీడియోను పంచుకొని విషెస్ తెలిపాడు. 'మీతో కలిసి వర్క్ చేయడం నాకు ఇష్టం. మీ పవర్‌ఫుల్ పాత్రను సిల్వర్ స్క్రీన్‌పై ప్రేక్షకులు చూడడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని క్యాప్షన్ ఇచ్చాడు. ఇక సమ్మర్ కానుకగా ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం నుంచి ఇటీవలే 'రై రై రా రా' సెకండ్ సింగిల్ విడుదలైంది. రికార్డింగ్ బ్రేకింగ్ వ్యూస్ తో యూట్యూబ్ లో ట్రెండ్ అవుతోంది. ఇక పెద్ది మూవీ తర్వాత జాన్వీ దేవర 2 చిత్రంలోనూ కనిపించనుంది. మరోవైపు అటు హిందీలోనూ వరుస సినిమాలతో బిజీగా ఉంటుంది.